# "పట్నంవెళ్ళిన మామ"

"పిల్లా! నేను పట్నం పోతా!"

"నువ్వు పట్నంపోతే నాగతి ఏమవుతుంది మామా?"

"మనవూరు పాడుబడింది. కలిగినవాళ్ళంతా పట్నానికి ఎగబాకినారు. ఏదో సంసారం గడవాలంటే నేను పట్నం పోకతప్పదు--"

"అయితే నీతో నేనుగూడా వస్తా మామా."

"నేను పోగానే పట్నంలో కొలువు దొరుకుతుందో లేదో—నువ్వు యిప్పుడే నాతోవస్తే యిద్దరం అష్టకష్టాలు పడవలసివస్తుంది. అందుకోసం, నేనుపోయి కొలువు చూసుకున్న తరువాత నేనేవచ్చి నిన్ను పట్నం తీసుకుపోతా."

"లేదు మామా నన్ను వదలిపెట్టిపోకు—నువ్వు లేకపోతే నేను బతకలేను— ఈ కసాయివాళ్ళు నన్ను బతకనివ్వరు—"

అవి మతపాక్షికత్వం ప్రబలంగా వ్యాపించిఉన్నరోజులు. అప్పట్లో దోపిడులు, గృహదహనాలు, సంస్థానంఅంతటా చెలరేగుతూ ఉండినాయి. రామచంద్రపురం ఒక కుగ్రామం. సంస్థానానికి ఒక మారుమూలలో ఉంటుంది. అందువల్ల అక్కడికి మతపాక్షికత్వపు ఝంఝామారుతం ఇంకా వీచలేదు. ఇప్పుడో అప్పుడో గ్రామం, మతావేశపరులయిన దుండగులకు బలి అవుతుందని ప్రజలు భయపడుతూ ఉండినారు- ఫలాని పల్లెటూరును దోచుకున్నారనీ, ఫలాని గ్రామానికి నిప్పంటించారనే వార్తలు రోజూ గ్రామానికి కొల్లలుగా చేరుతున్నాయి. రైతులకు పంటలమీద శ్రద్ధ తగ్గింది. తదితర అలగాజనానికి గ్రామ వృత్తులపైన నైరాశ్యం కలిగింది. ధనవంతులు గ్రామాన్ని వీడి పరరాష్ట్రాలకు వెడుతున్నారు.

బీదసాదలకు, గ్రామాన్ని వీడి వెళ్ళడంమాట అటుంచి, కరువు కాటకాల వల్ల, అల్లరిమూకల ఘాతుకకృత్యాలవల్ల బతుకుని ఈడ్వడమే దుర్భరమైపోయింది. పాపం బీదవారు ధనాభావంతో ఇతర ప్రాంతాలకు వెళ్ళలేక గుడ్డిలో మెల్లఅని, బ్రతికి బట్టకడితే చాలుననే భావంతో పట్నవాసాలకు చేరుకుంటున్నారు. పాపం ఎంకడు పరిస్థితులన్నీ గమనించి, పట్నానికి వెళ్ళి జీవనోపాధిని చూసుకోవడమే శ్రేయస్కరమని భావించాడు. భార్యాభర్తలు యిద్దరూ వెడితే, కూలీనాలీ దొరకక, నానా అవస్థలపాలు కావలసి వస్తుందేమోననే భయంకొద్దీ, భార్యను అప్పటిమట్టుకు ఊళ్ళోనే వదిలి వెళ్ళడం మంచిదని నిశ్చయించుకొని ఆమెను ఒప్పించడానికి పూనుకున్నాడు.

"పిల్లా మనం ఇక ఈ ఊళ్ళో ఉండలేము. మనకు తెలిసినవాళ్ళల్లా పట్నవాసాలకు చేరుకున్నారు. పట్నానికి వెళ్ళిన మన ఊరివాళ్ళను వెతికి, కూలో, నాలో సంపాదించి, ఒక నెలరోజుల తరువాత నేనేవచ్చి నిన్ను తీసుకొని వెడుతా! అంతవరకు నువ్వు ఏదోవిధంగా ఓపికపట్టి ఈఊళ్ళోనే ఉండడం మంచిది. లేకపోతే పట్నంలో యిద్దరమూ పొట్టగడవక నానా కష్టాలూ పడవలసి వస్తుంది."

"మామా! మనకు కష్టాలు ఏమైనా కొదవా! 'కో' అంటే కోటి కష్టాలు వచ్చిపడుతాయి. కష్టాలను ఈడ్వడం తప్పదు—అందువల్ల, యిద్దరం ఒకచోటేఉండి వాటిని ఎదుర్కోవడం మంచిదని నాకు తోస్తున్నది."

"అది నిజమే—కాని మనదగ్గర ప్రస్తుతం డబ్బేమీలేదు. వెళ్ళీ వెళ్ళడంతోనే యితరులపైన పట్నంలో ఆధారపడవలసి వస్తుంది. మన మెన్నడూ దేహీ అని ఇతరులను యాచించి యెరగము. మగవాడిని నేను ఎన్నికష్టాలైనా సద్దుకుంటాను. కాని నువ్వు ఈ అవస్థలన్నీ పడలేవు. అందువల్ల నువ్వు ఇక్కడే వుండిపోవడం మంచిది."

"మామా! అయితే నువ్వు ఎన్నిరోజులకు వస్తావు?"

"పిల్లా! నేనుమాత్రం నిన్నువదిలి ఎక్కువరోజులు ఉండగలనా? నాలుగురాళ్ళు సంపాదించడంతోనే ఇక్కడికివచ్చి వాలనూ?"

ఎంకి కాపురానికివచ్చి, తీరా ఒక సంవత్సరమైనా కాలేదు. అంతలోనే ఈ అల్లరు ఉప్పెనకమల్లె వచ్చిపడ్డాయి. చల్ల కదలకుండా గడుస్తున్న సంసారం, ఒక్కమారే తలక్రిందు లైంది. బ్రతుకు గడవడమే కష్టంగా పరిణమించింది. భర్త వెళ్ళకతప్పదని తెలియడంతోనే, అఘాటు పాటున ఎంకికళ్ళల్లో గిరుసిన నీళ్ళుతిరిగాయి. ఎంకడి ఎడబాటు, ఎందుకో దుర్భరంగా తోచింది. పెద్దపెట్టున గొల్లుమంటూ ఎంకి, ఎంకడి కండలు తీరిన శరీరాన్ని చుట్టివేసింది. భార్య దుఃఖాన్నిచూచి, ఎంకడికికూడా దుఃఖం పొంగి పొరలి, గట్లు దాటి ప్రవహించడం మొదలుపెట్టింది. కాని కర్కశజీవితం ఏ దుఃఖాన్నీచూచి జాలిపడదు. కష్టాలకోసమే బీదరికం ఈ దారుణ ప్రపంచంలో పుట్టింది. అది ఆకష్టాలను అనుభవించక తప్పదు.

* * * *

మరునాటి ఉదయం ఎంకడు హైదరాబాదుకు బయల్దేరాడు. ఎంకి, ఎంకడు వెళ్ళినదారికి కళ్ళు అప్పగించి, తన దుర్దశకు జలజల కన్నీళ్ళు కార్చడం మొదలుపెట్టింది. ఎంకడు హైదరాబాదు చేరుకొని తన ఊరివాళ్ళకోసం, ఆరోజుఅంతా నగరం గాలించాడు. కాని వాళ్ళ ఆచూకీ ఎక్కడా దొరకలేదు- చేతిలో డబ్బులేదు. కడుపు దహించుకపోతున్నది- బిచ్చమెత్తడం అతనికి ఏమాత్రం మనస్కరించలేదు. దారిన వెడుతూన్న ఒక రిక్షావాణ్ణిపిలచి, వాడు ఊరివాడుగాఉండడం గమనించి, అతనిపై ప్రశ్నల పరంపరను కురిపించాడు.

"మనది ఏవూరని?"

"బాలసింగారం"

"ఎన్నిరోజులనించి ఈపని చేస్తున్నావు?"

"ఆరునెల్లనించి"

"రోజుకు ఎంత గిట్టుతుంది?"

"చెప్పడం కష్టం. దొరికిననాడు బాగానే దొరుకుతుంది. దొరకని నాడు ఏమీలేదు."

"ఈ బండి నీదేనా?"

"కాదు, దీన్ని బండి అనరు, రిక్షా అంటారు"

"నీది కాకపోతే నీదగ్గర ఎందుకున్నది?"

"కిరాయికు తీసుకొచ్చా."

"కిరాయి ఎంత?"

"రోజుకు రెండు."

"అమ్మో! రోజుకు రెండు రూపాయీలే?"

"మనది ఏ ఊరూ?"

"రామచంద్రపురం."

"పట్నం ఎప్పుడు వచ్చావు?"

"నిన్ననే"

"బతుకు తెరువుకోసమేనా?"

"అవును."

"ఎక్కడైనా చూసుకున్నావా?"

"లేదు."

"ఏమి చేతామనుకుంటున్నావు?"

"ఈ బండి తొక్కడం నాకు నేర్పుతావా."

"బండికాదు—రిక్షా—నేర్చుకుంటే తప్పకుండా నేర్పుతా."

"కింద పడుతానా?"

"లేదు- తొక్కిచూడు ఏమీపడవు."

ఎంకడికి ఆకలివల్ల బండి ఎక్కడంతోనే కళ్ళు గిర్రున తిరిగాయి. తూలిపోతూ ఉండడం గమనించి, రాముడు, నువ్వు ఈరోజు ఏమీ తినలేదా అని అడిగాడు. ఎంకడు 'డబ్బులేదు' అని జవాబు చెప్పాడు. రాముడు జాలిచెంది ఎంకడిని హొటలుకు తీసుకొని వెళ్ళాడు. కడుపునిండా బజ్జీలు, పకోడీలు పెట్టించి, బలవంతంగా ఎంకడితో, టీ తాగించాడు.

ఎంకడు మరునాటినుంచీ రిక్షావృత్తి అవలంబించాడు. డబ్బు ఎక్కువ గడింతామన్న ఆశతో రాత్రింబగళ్లూ రిక్షా నడపడం మొదలుపెట్టాడు. రాత్రికి ఏ రెండుమూడు గంటలకో అదే రిక్షాలో పడుకునేవాడు. మళ్ళీ తెల్లవారుఝామునే కిరాయకు బయల్దేరేవాడు. రోజూ, అన్నం ఉండేది కాదు. కనపడిన హొటల్‌లోకి దూరి బజ్జీలు, పకోడీలు, పూరీలతో కాలం గడిపేవాడు. మూడునెల్లు అయ్యేసరికల్లా ఎంకడి కండలుతీరిన శరీరం దిగజారిపోయింది. మనిషి సన్నగా గుర్తుపట్టడానికికూడా వీలు లేకుండా మారిపోయినాడు. అప్పుడప్పుడూ అతనికి ఎంకి జ్ఞాపకమొచ్చేది. ఎంకి జ్ఞాపకంవచ్చిననాడల్లా, అతను ద్విగుణీకృతోత్సాహంతో పనిచేసే వాడు. ఒకనాడు అతనికి గుండెలో ఏదో సన్నని నొప్పి లేచింది. అతను మొదట ఆ నొప్పిని ఏమాత్రం లక్ష్యం చేయలేదు. నొప్పి క్రమంగా వృద్ధి చెంది దగ్గులోకి పరిణమించింది. దగ్గు రోజురోజు ఎక్కువ కావడం మొదలు పెట్టింది. అయినా అతను ఎంకిని త్వరగా పట్నం తెచ్చుకోవాలనే ఉద్దేశంతో రిక్షా నడపడం మానలేదు. దగ్గు వాంతులకు దారితీసింది-నెమ్మదిగా జ్వరం రావడం మొదలుపెట్టింది- ఎక్కడా నిలువనీడ లేక రాత్రిళ్ళు ఎంకడు ఆ రిక్షాలోనేపడి మూల్గేవాడు. ఉదయం మళ్ళీ ఏదో కొద్దిగా తేరుకొని, టీ, కాఫీలతో ఉపశాంతిపొంది, మళ్ళీ రిక్షానడిపేవాడు. ఈవిధంగా కొన్నిరోజులు గడిచాయి. వాంతులు క్రమంగా హెచ్చాయి-నోటిగుండా దగ్గితే రక్తం పడడం మొదలుపెట్టింది. ఒకనాడు రాముడు ఈ స్థితిచూచి ఎంకడిని తనయింటికి తీసుకొని వెళ్ళాడు. ఆనాడు ఎంకడికి అన్నం సహించలేదు. రక్తం పడడం మరీ ఎక్కువైంది. రాత్రంతా ఎంకీ ఎంకీ అని కలవరించాడు. కాని ఆరాత్రి ఎంకడికి, ఎంకి కలలోనైనా కనపడలేదు. ఉదయం అయ్యేసరికి పక్కన రూపాయిల మూటతో ఎంకడు కాలధర్మం చెందాడు. పాపం, ఎంకికి ఈ సంగతేమీ తెలియదు.

పట్నంవెళ్లిన మామ రాకకోసం ఎంకి రోజూ దారులు కాస్తున్నది.